
AKSHARA TODAY

అక్షర టుడే

TOWARDS... TRUTH, TRUST, TREND

www.aksharatoday.in

ఫేక్ సర్టిఫికెట్లతో జీవితాలు తారుమారు



2



ఫామ్ హౌస్‌లో ఏఈవో బలవన్మరణం

2

ఈవీఎం గోడౌన్‌ను సందర్శించిన కలెక్టర్



అక్షరటుడే, నిజామాబాద్ సిటీ: వినాయకనగర్‌లో ఈవీఎం గోడౌన్‌ను బుధవారం కలెక్టర్ ఇలా త్రిపాఠి అదనపు కలెక్టర్ వి.భుజంగరావుతో కలిసి సందర్శించారు. సాధారణ పరిశీలన ప్రక్రియలో భాగంగా క్షేత్రస్థాయి సందర్శన జరిపారు. ఈవీఎం గోడౌన్‌కు వేసిన సీళ్లను పరిశీలించారు. గోడౌన్ వద్ద పోలీసు బందోబస్తు తీరును పరిశీలించారు. కలెక్టర్ వెంట అగ్నిమాపక శాఖ అధికారి శంకర్, ఎన్నికల విభాగం సిబ్బంది సాత్విక్, విజయేందర్ రెడ్డి తదితరులు ఉన్నారు.



ఖిల్లా రామాలయాన్ని సందర్శించిన అధికారులు

అక్షరటుడే, ఇందూరు: నగరంలోని ప్రసిద్ధ చారిత్రక కట్టడమైన ఖిల్లా రామాలయం అభివృద్ధికి అడుగులు పడ్డాయి. ఆలయంలో రూ.180కోట్లతో రోప్‌వే నిర్మించేందుకు పర్యాటక శాఖ ముందుకొచ్చింది. ఈ మేరకు అధికారులు ఆలయాన్ని సందర్శించారు.. రాష్ట్రంలోనే చారిత్రక కట్టడమైన ఇందూరు ఖిల్లా రామాలయ అభివృద్ధికి అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అనేకసార్లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లారు. కేంద్ర మంత్రులను కలిసి ఖిల్లా రామాలయ అభివృద్ధికి 'పర్వతమాల పథకం'ను అమలు చేయాలని కోరారు. ప్రధానంగా పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు రూ.180 కోట్లతో రోప్‌వేతో పాటు అభివృద్ధి చేయాలని కోరారు. ఈ క్రమంలో అధికారులు, రోప్ వే కంపెనీ సీఆర్ఎస్ ప్రతినిధులు ఆలయ పరిసరాలను పూర్తిగా పరిశీలించారు. త్వరలోనే ఇందుకు సంబంధించిన డీపీఆర్‌ను సిద్ధం చేయనున్నట్లు వెల్లడించారు. ఆర్‌అండ్‌బీ డీఈ మోహన్, రోప్ వే కంపెనీ ప్రతినిధి తన్మయ్ రాయ్ తదితరులు పాల్గొన్నారు.



ఎస్ఐఆర్ అమలును నిరసిస్తూ జ్ఞానేష్ కుమార్ దిష్టిబొమ్మ దహనం

అక్షరటుడే, నిజామాబాద్ సిటీ: ఎస్ఐఆర్‌ను వెంటనే రద్దుచేయాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. నగరంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో బుధవారం ఎలక్షన్ కమిషన్ ఛైర్మన్ జ్ఞానేష్ కుమార్ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. డీసీసీ అధ్యక్షుడు నగేష్ రెడ్డి, కార్పొరేషన్ అధ్యక్షుడు బొబ్బిలి రామకృష్ణ మాట్లాడుతూ.. ఎస్ఐఆర్‌ను వెంటనే రద్దు చేయాలని, జ్ఞానేష్‌కుమార్ తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఎస్ఐఆర్ కారణంగా కోట్ల మంది ప్రజలు తమ ఓటుహక్కు కోల్పోయి ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఓట్ చోరీ ద్వారా బీజేపీ మళ్లీ అధికారంలోకి రావాలని కుట్ర పన్నుతోందని.. అందుకే ఎస్ఐఆర్ తీసుకొచ్చిందని ఆరోపించారు. ఈ క్రమంలో జ్ఞానేష్ కుమార్ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న క్రమంలో పోలీసులు, కాంగ్రెస్ నాయకుల మధ్య తోపులాట జరిగింది. పోలీసులు దిష్టిబొమ్మను దహనం చేయకుండా ఆపేందుకు ప్రయత్నించారు. కార్యక్రమంలో ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి వినయ్‌రెడ్డి, సీనియర్ నాయకులు నరాల సుధాకర్, శరత్, వరదబట్టు వేణురాజ్ తదితరులు పాల్గొన్నారు.

హోటల్ ఫుడ్ భద్రమేనా..?



ఉమ్మడి జిల్లాలో పలు హోటళ్లు, జాతీయ రహదారుల పక్కన ఉన్న దాబాల్లో భోజనం, ఇతర పదార్థాల నాణ్యతపై అనుమానాలు రేకెత్తిస్తున్నాయి. కుళ్లిన మాంసం, ఆహార పదార్థాల చుట్టూ బొద్దింకలు, బల్లులు తిరుగుతుండడం, అపరిశుభ్రమైన కిచెన్ వాతావరణం చూసి ఫుడ్ సేఫ్టీ అధికారులే అవాక్కయ్యారు. ఇలా కూడా హోటళ్ల నిర్వహణ ఉంటుందా అని ముక్కున వేలేసుకున్నారు. తాజాగా టీజీ సేఫ్ బృందం చేపట్టిన తనిఖీల్లో విస్తుపోయే నిజాలు బహిర్గతం కావడం చర్చనీయాంశంగా మారింది. - అక్షరటుడే, కామారెడ్డి

- హోటల్స్, దాబాలలో పరిశుభ్రత కరువు
- కుళ్లిన కూరగాయలు, మాంసంతో వంటకాలు
- టీజీసేఫ్ అధికారుల దాడులతో భాగోతం బట్టబయలు
- 9 హోటల్స్ లైసెన్సులు సస్పెండ్ చేసిన టీజీసేఫ్ బృందం
- ఆరింటికి షోకాజ్ నోటీసులు

ఉమ్మడి నిజామాబాద్ జిల్లా లో టీజీ సేఫ్ ఆధ్వర్యంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు చేపట్టిన దాడుల్లో హోటళ్ల భాగోతం బయటపడింది. ప్రజలకు సురక్షితమైన, నాణ్యమైన ఆహారం అందేలా చర్యలు తీసుకోవడంలో భాగంగా తెలంగాణ స్టాండర్డ్స్ అథారిటీ ఫర్ ఫుడ్ అండ్ ఎసెన్షియల్ డ్రగ్స్ (టీజీ సేఫ్) ఆధ్వర్యంలో మంగళవారం జాతీయ రహదారి 44 వెంట ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. టీజీ సేఫ్‌కు చెందిన 10 బృందాలు మెదక్, నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో మొత్తం 20 ఆహార సంస్థలను తనిఖీ చేశాయి. ఇందులో కామారెడ్డి జిల్లాలో జాతీయ రహదారి 44 వెంట 8 రెస్టారెంట్లను తనిఖీ చేశారు.

హోటల్స్, దాబాలలో పరిశుభ్రత కరువు

తనిఖీ చేసిన దాదాపు అన్ని హోటళ్లలో పరిశుభ్రత అనేది నామమాత్రంగానే ఉందని అధికారులు గుర్తించారు. వంటగదుల్లో జిడ్డు పేరుకుపోయి ఉండటం, ఫ్లోర్ పై చెత్త, కిచెన్ స్లాబ్ లు అపరిశుభ్రంగా ఉండటం, చేతి తొడుగులు, తలకు టోపీలు లేకుండానే వంట చేయడం, ఫుడ్ హ్యాండ్లింగ్ చేసే సిబ్బందికి మెడికల్ ఫిట్నెస్ సర్టిఫికెట్లు లేకపోవడం సాధారణంగా కనిపించింది. కీటకాలు, బొద్దింకలు, ఈగలు వంటగదిలోనే తిరుగుతున్న దృశ్యాలు అధికారులనే విస్మయానికి గురి చేశాయి.

కుళ్లిన కూరగాయలు, మాంసంతో వంటకాలు

లాభాల కోసం కొందరు హోటల్ నిర్వాహకులు కుళ్లిన కూరగాయలు, వాడిపోయిన ఆకుకూరలు, గడువు ముగిసిన పాల ఉత్పత్తులు, సాస్ లు, ఫ్రిజ్ లో నిల్వ ఉంచిన పాచిపోయిన మాంసంతో కర్రీలు, బిర్యానీలు తయారు చేస్తున్నట్లు బయటపడింది. కొన్ని చోట్ల ఫ్రిజ్ లలో శాఖాహారం, మాంసాహారం కలిపి నిల్వ చేయడం, లేబుల్ లేని, తయారీ తేదీ లేని ఆహార పదార్థాలను వాడుతున్నట్లు గుర్తించారు. ఇలాంటి ఆహారం తింటే ఫుడ్ పాయిజన్, కడుపు నొప్పి, వాంతులు, విరేచనాలు తప్పవని వైద్యులు హెచ్చరిస్తున్నారు. హోటళ్ల నిర్వహకులు నిబంధనలు పాటించకపోవడంతో అధికారులు చర్యలు చేపట్టారు.

షోకాజ్ నోటీసులు జారీ

లైసెన్సులు సస్పెండ్ చేయడమే కాకుండా, మరికొన్ని హోటళ్లకు హెచ్చరికలు జారీ చేశారు. భిక్కనూర్ మండలం జంగంపల్లి వద్ద శ్రీ ఆధ్య గ్రాండ్ మల్టీ క్యూజిన్ రెస్టారెంట్‌కు షోకాజ్ నోటీసు జారీ చేసి జరిమానా విధించే ప్రక్రియ మొదలుపెట్టారు. కామారెడ్డి మండలం నర్సన్నపల్లి శివారులో ఆర్ఎస్ గ్రాండ్ రెస్టారెంట్‌కు ఇంప్రూవ్‌మెంట్ నోటీసు ఇచ్చారు. మొత్తం మూడు జిల్లాల్లో 21 ఆహార నమూనాలను సేకరించి ల్యాబ్‌కు పంపారు. రిపోర్టు ఆధారంగా మరిన్ని కఠిన చర్యలు ఉంటాయని అధికారులు తెలిపారు.

9 హోటల్స్ లైసెన్సుల సస్పెన్షన్..

తనిఖీల్లో తీవ్రమైన ఉల్లంఘనలు బయటపడటంతో అధికారులు ఉపేక్షించలేదు. మూడు జిల్లాల్లో మొత్తం 9 హోటళ్ల ఆహార లైసెన్సులను సస్పెండ్ చేసి, తక్షణమే షట్టర్ డౌన్ చేయించారు. ఇందులో కామారెడ్డి జిల్లాలోనే ఆరు ఉన్నాయి. భిక్కనూర్ మండలం బస్వాపూర్ వద్ద జైకా మల్టీ క్యూజిన్ ఫ్యామిలీ రెస్టారెంట్, అంతంపల్లి వద్ద ది మాల్గుడి రెస్టారెంట్, భిక్కనూర్ సమీపంలో వసుధ ఫ్యామిలీ రెస్టారెంట్, కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని అడ్లూర్ శివారులో ఉన్న న్యూ ఉడిపి కృష్ణ భవన్, సదాశివనగర్ మండలం అడ్లూర్ ఎల్లారెడ్డి (కుప్రియల్ స్టేజి) వద్ద లుఫ్యాన్స్ ఫ్యామిలీ రెస్టారెంట్, సదాశివనగర్ వద్ద తాజ్ ఫ్యామిలీ దాబాల లైసెన్సులు సస్పెండ్ చేశారు. నిజామాబాద్ నగరంలోని గ్లామర్ హోటల్‌ను సీజ్ చేశారు.

దారికి వస్తారా..

అధికారుల దాడులు, లైసెన్సుల సస్పెన్షన్‌తో ప్రస్తుతానికి హోటల్ నిర్వాహకుల్లో వణుకు మొదలైంది. అయితే ఇది తాత్కాలికమేనా..? లేక శాశ్వతంగా మార్పు వస్తుందా..? అనేది ప్రజల్లో చర్చగా మారింది. గతంలో కూడా ఇలాంటి దాడులు జరిగినప్పుడు కొన్ని రోజులు హడావుడి చేసి మళ్లీ యథాతథంగా నాసిరకం ఫుడ్ పెడుతున్నారనే విమర్శలు ఉన్నాయి. ఈసారైనా హోటల్ యజమానులు దారికి వచ్చి పరిశుభ్రత పాటిస్తారా లేక మళ్లీ లైట్ తీసుకుంటారా అనేది వేచి చూడాలి.



అంగన్‌వాడీల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కృషి : స్రవంతిరెడ్డి

అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్ : అంగన్ వాడీల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు స్రవంతిరెడ్డి అన్నారు. అంగన్ మిలన్ సేవా సంపర్క్ కార్యక్రమంలో భాగంగా నగరంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. నగరంలోని 23వ డివిజన్‌లో అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించిన గోపిడి స్రవంతి రెడ్డి చిన్నారులతో ముచ్చటించారు. అంగన్ మిలన్ సేవ ద్వారా అంగన్‌వాడీల బలోపేతం, మహిళలు, చిన్నారుల పోషకాహారం, ఆరోగ్యంపై అవగాహన పెంచేందుకు కృషి చేస్తున్నామన్నారు. అంగన్‌వాడీ టీచర్‌ను సన్మానించారు. 22వ డివిజన్ కార్పొరేటర్ వైష్ణవి, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు మారెడ్డి వనిత, ఉపాధ్యక్షురాలు శైలజ, స్వరూప, పురుషోత్తం, సుధ, సురేష్, రాజేశ్వర్ పాల్గొన్నారు.



బ్రెస్ట్ క్యాన్సర్‌పై ప్రతి మహిళకు అవగాహన ఉండాలి

అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్: బ్రెస్ట్ క్యాన్సర్‌పై మహిళల్లో అవగాహన పెంచేందుకు అక్టోబర్ నెలను బ్రెస్ట్ క్యాన్సర్ అవేర్‌నెస్ మంత్ గా నిర్వహిస్తున్నామని మెడికవర్ హాస్పిటల్స్ నిజామాబాద్ గైనకాలజిస్ట్ శరణ్య తెలిపారు. ఈ మేరకు గురువారం ప్రకటన విడుదల చేశారు. డా. శరణ్య మాట్లాడుతూ.. బ్రెస్ట్ క్యాన్సర్‌ను తొలిదశలోనే గుర్తిస్తే చికిత్స ద్వారా పూర్తిగా నయం చేసే అవకాశాలు ఉంటాయని తెలిపారు. మహిళలు తమ ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం చేయకుండా, రొమ్ములో గడ్డ, పరిమాణంలో మార్పులు, చర్మంలో మార్పులు వంటి లక్షణాలు కనిపిస్తే వైద్యులను సంప్రదించాలని సూచించారు. మెడికవర్ హాస్పిటల్‌లో మహిళల ఆరోగ్య పరిరక్షణకు అవసరమైన అవగాహన కార్యక్రమాలను

సామాజిక బహిష్కరణలపై బీసీ కమిషన్‌కు ఫిర్యాదులు



అక్షరటుడే, నిజామాబాద్ సిటీ: సామాజిక బహిష్కరణ ఉదంతాలపై రాష్ట్ర వెనుకబడిన తరగతుల కమిషన్‌కు ఇటీవల ఫిర్యాదులు వెళ్లాయి. ఈ క్రమంలో కమిషన్ ఛైర్మన్ నిరంజన్ నేతృత్వంలో సభ్యులు తిరుమలగిరి సురేందర్, రాపోలు జయప్రకాశ్, బాలలక్ష్మిలతో కూడిన బృందం బుధవారం జిల్లా కు విచ్చేసింది. కమిషన్ సభ్యులు కలెక్టరేలో బాధితులతో భేటీ అయ్యారు. ఐడీవోసీకి చేరుకున్న కమిషన్ ప్రతినిధులకు కలెక్టర్ ఇలా త్రిపాఠి, అదనపు కలెక్టర్ వి.భుజంగరావు తదితరులు పూలమొక్కలు అందించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సాంఘిక, కుల బహిష్కరణలకు గురైన బాధితులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కమిషన్ ఛైర్మన్, సభ్యులకు లిఖితపూర్వకంగా విజ్ఞాపనలు సమర్పించారు. బాధితులు భయం లేకుండా, స్వేచ్ఛగా వారి అభిప్రాయాలను వెల్లడించేందుకు వీలుగా తగిన ఏర్పాట్లు చేశారు. దీంతో జిల్లాలోని ఆయా ప్రాంతాలలో గ్రామాభివృద్ధి కమిటీల పేరిట కొనసాగుతున్న అరాచకాల గురించి, సామాజిక బహిష్కరణ ఘటనలను బాధితులు కమిషన్‌కు ఏకరువు పెట్టారు. బీసీ కుల సంఘాల నాయకులు, వివిధ వర్గాల వారు, ప్రజా సంఘాల ప్రతినిధులు సైతం హాజరై రాతపూర్వకంగా వినతి పత్రాలను కమిషన్‌కు అందిస్తూ, మౌఖికంగా కూడా తమ అభిప్రాయాలను వెల్లడించారు.

రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

అక్షరటుడే, కామారెడ్డి: రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ అన్నారు. బుధవారం బీబీపేట్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. నూతన ఛైర్మన్ సుతారి రమేష్‌తో పాటు పాలకవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో రైతు భరోసా, రుణమాఫీ, ఉచిత విద్యుత్, రైతు బీమా వంటి పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. రైతులకు పంట రుణాలు, విత్తనాలు, ఎరువులు సకాలంలో అందించడంలో పీఏసీఎస్ లు కీలక పాత్ర పోషించాలని సూచించారు. రాజకీయ భేదాలు లేకుండా ప్రతి రైతుకు సమానంగా సేవలందించాలని నూతన పాలకవర్గానికి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు ఇలియాస్, జిల్లా గ్రంథాలయ ఛైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి, బీబీపేట్ సర్పంచ్ సాత్విక సాయి, మండల నాయకులు, సొసైటీ ఛైర్మన్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.



మత్తు పదార్థాల రవాణా, విక్రయాలపై ఉక్కుపాదం



అక్షరటుడే, నిజామాబాద్ సిటీ: మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాల రవాణా, విక్రయం, వినియోగంపై గట్టి నిఘా కొనసాగించాలని, అక్రమార్కులపై ఉక్కుపాదం మోపాలని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి సూచించారు. బుధవారం కలెక్టర్ ఇలా త్రిపాఠి తో కలిసి ఎక్సైజ్ తదితర శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఇటీవలి కాలంలో పల్లెల్లో గుడుంబా, నాటుసారా విక్రయాలు తిరిగి మొదలైనట్లు తెలుస్తోందని, ప్రజల ఆరోగ్యాలను దెబ్బతీసే ఇలాంటి మత్తు పదార్థాల నిరోధానికి చిత్తశుద్ధితో కృషి చేయాలని సుదర్శన్ రెడ్డి అన్నారు. యువతను, విద్యార్థులను మత్తుకు బానిసలుగా మారుస్తూ వారి భవిష్యత్తును అంధకారంగా మారుస్తున్న గంజాయి విక్రయాలపై గట్టి నిఘా ఉంచాలని సూచించారు. ఎన్ ఫోర్సుమెంట్, ఎక్సైజ్ బృందాలు సంయుక్తంగా దాడులు నిర్వహించాలని, ఎక్కడ కూడా మత్తు పదార్థాల జాడ కానరాకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలన్నారు. అదేవిధంగా కల్తీకల్లు విక్రయాలకు పూర్తిస్థాయిలో అడ్డుకట్ట వేయాలన్నారు. ఎక్కడైనా కల్తీ కల్లు కారణంగా అవాంచనీయ ఘటనలు జరిగితే, అందుకు ఎక్సైజ్ అధికారులే బాధ్యత వహించాల్సి వస్తుందని సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ.. మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాలను రవాణా చేసే వారిని, వాటిని విక్రయిస్తున్న వారిని, వాటిని వినియోగిస్తున్న వారిని పక్కాగా గుర్తిస్తూ నిరంతర నిఘా కొనసాగించాలని ఆదేశించారు. ఉర్దూ అకాడమీ ఛైర్మన్ తాహెర్ బిన్ హందాన్, జిల్లా రెవెన్యూ అధికారి గీత, ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ పి.శ్రీధర్, సూపరింటెండెంట్ నందగోపాల్ పాల్గొన్నారు.

గో సేవ, గో సంరక్షణను బాధ్యతగా తీసుకోవాలి



అక్షరటుడే, నిజామాబాద్ సిటీ: గోసేవ, గో సంరక్షణను బాధ్యతగా తీసుకోవాలని రాష్ట్ర గో సంరక్షణ సేవాసమితి, పర్యావరణ సంరక్షణ సేవా సమితి రాష్ట్ర కార్యదర్శి ధన్‌పాల్ రాజేష్ పేర్కొన్నారు. ఏకాదశి సందర్భంగా జిల్లా కేంద్రంలోని గోశాలలో గోవులకు ఆహారం తినిపించి.. సేవా కార్యక్రమం నిర్వహించారు. ధన్‌పాల్ రాజేష్ మాట్లాడుతూ.. మాట్లాడుతూ గోసంరక్షణ, పర్యావరణ సంరక్షణ, సమాజ శ్రేయస్సు కోసం తమ సేవా సమితి కృషి చేస్తోందన్నారు. అలాగే, సేవాసమితి అధ్యక్షుడు సామ్రాట్ విక్రమాదిత్య, ఉపాధ్యక్షుడు ఉదయ్ భాస్కర్, అయ్యప్ప స్వామి ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా గోసేవా కార్యక్రమాలను విస్తృతం చేస్తున్నామన్నారు. గోసేవా కార్యక్రమాల్లో ప్రతిఒక్కరూ సమయం వెచ్చించి పాల్గొనాలని ఆయన కోరారు.

రాజ్యాంగంపై అవగాహన కార్యక్రమం



అక్షరటుడే, బోధన్: పట్టణంలోని కేంద్రీయ విద్యాలయంలో ఛత్రపతి శివాజీ యూత్ అసోసియేషన్, బోధన్ ఆధ్వర్యంలో భారత రాజ్యాంగంపై అవగాహన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి దేవోల్లా శంకర్ ముఖ్యవక్తగా హాజరై విద్యార్థులకు భారత రాజ్యాంగం, రాజ్యాంగ విలువలు, పౌరుల హక్కులు బాధ్యతలపై అవగాహన కల్పించారు. శంకర్ మాట్లాడుతూ, అంబేద్కర్ ప్రపంచ మేధావి అని, భారత రాజ్యాంగం దేశ ప్రజలకు న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం వంటి విలువలను అందించిందన్నారు. ఛత్రపతి శివాజీ యూత్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు అడ్లూరి శ్రీనివాస్, హెచ్ఎం వీరేందర్ సింగ్, సురేష్, పెర్కా వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

సమయానికి రాని బస్సులు.. ప్రయాణికులకు ఇబ్బందులు



అక్షరటుడే, నందిపేట్: సమయానికి బస్సులు రాకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై అధికారులకు సమాచారం అందించినప్పటికీ పట్టించుకోవట్లేదని వారు వాపోతున్నారు. నందిపేట్ ప్రయాణ ప్రాంగణంలో బస్సులు సమయానికి రావడం లేదు. బస్టాండ్ ఆవరణలోకి ప్రైవేటు వాహనాలు ఇష్టానుసారంగా రావడంతో ఇబ్బందులుకు గురవుతున్నారు. నిజామాబాద్, ఆర్మూర్ మండలంలోని వివిధ గ్రామాలకు వెళ్లే ప్రయాణికులు వందల సంఖ్యలో బస్టాండ్‌కు వస్తున్నారు. ఉదయం సాయంత్రం వేళలో రద్దీ మరింత ఎక్కువగా ఉంటుంది. అయితే ఆర్టీసీ బస్సులు సమయానికి రాకపోవడంతో వేచి ఉండాల్సి వస్తోందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా బస్సుల ఆలస్యాన్ని ఆసరాగా చేసుకుని బస్టాండ్ లోపల ప్రైవేట్ ఆటోలు, వ్యాన్లు నిలిపి ఎక్కించుకుంటున్న పరిస్థితి కూడా ఉంది. గత్యంతరం లేక ప్రైవేట్ వాహనాల వైపు ప్రయాణికులు మొగ్గు చూపుతున్నారు.

నకిలీ సర్టిఫికెట్లకు కామారెడ్డి కేరాఫ్ అడ్రస్‌గా మారుతోంది. ఎలాంటి సర్టిఫికెట్ కావాలన్నా డబ్బులిస్తే క్షణాల్లో కళ్లముందు ఉంటున్నాయి. దాంతో ప్రభుత్వ పథకాల లబ్ధి కోసం, రిజిస్ట్రేషన్ ఇతరత్రా అవసరాల కోసం నకిలీ సర్టిఫికెట్లను విచ్చలవిడిగా వాడుతున్నారు. ఫలితంగా నకిలీ సర్టిఫికెట్ ఏది, ఒరిజినల్ సర్టిఫికెట్ ఏది అనేది తెలియని పరిస్థితి నెలకొంది. అధికారులు సైతం తెచ్చిన సర్టిఫికెట్ నిజమా..? కాదా..? అని తెలుసుకోకుండా పనులు చేయడం సర్వత్రా చర్చనీయాంశంగా మారుతోంది.
– అక్షరటుడే, కామారెడ్డి



ఫేక్ సర్టిఫికెట్లతో జీవితాలు తారుమారు..

■ నకిలీ సర్టిఫికెట్ల అడ్డాగా కామారెడ్డి ■ నెలరోజుల క్రితం ప్రభుత్వ వైద్యుని సంతకం ఫోర్జరీ
■ తాజాగా బతికున్న మహిళకు డెత్ సర్టిఫికెట్.. ■ అక్రమంగా ఇంటి రిజిస్ట్రేషన్

కామారెడ్డి జిల్లాలో ఫేక్ సర్టిఫికెట్ల దందా రోజురోజుకూ శృతి మించుతోంది. ప్రభుత్వ పథకాల కోసం పుట్టిన తేదీలు మార్చడం నుంచి, బతికున్న వారిని చనిపోయినట్లు చూపించి ఆస్తులు కొట్టేయడం వరకు అక్రమాలు విచ్చలవిడిగా సాగుతున్నాయి. అధికారుల నిర్లక్ష్యం, పర్యవేక్షణాలోపం ఈ ముఠాలకు వరంగా మారింది. ఫలితంగా పెద్దఎత్తున నగదు చేతులు మారుతున్నట్టుగా తెలుస్తోంది.

పథకాల కోసంరీ..

జిల్లాలో కళ్యాణలక్ష్మి పథకానికి సంబంధించి వరుసగా ఫేక్ సర్టిఫికెట్లు బయటపడుతున్నాయి. అర్హత లేకపోయినా ఆదాయం, కులం, పుట్టిన తేదీ సర్టిఫికెట్లను ఫోర్జరీ చేసి రూ.లక్షల్లో లబ్ధి పొందేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారు. మీసేవా కేంద్రాల్లో అప్‌లోడ్ చేసే డాక్యుమెంట్లను క్షుణ్ణంగా పరిశీలించకపోవడం, ఫీల్డ్ వెరిఫికేషన్ మొక్కుబడిగా సాగడం వల్లే ఈ అక్రమాలకు అడ్డుకట్ట పడటం లేదని తెలుస్తోంది.దీంతో నకిలీ సర్టిఫికెట్లతో పలువురు లబ్ధి పొందుతున్నారు.

బతికున్న మహిళకు డెత్ సర్టిఫికెట్

తాజాగా వెలుగులోకి వచ్చిన ఘటన అధికార వ్యవస్థ తీరుకు అద్దం పడుతోంది. కామారెడ్డి పట్టణంలో బతికున్న ఓ మహిళకు డెత్ సర్టిఫికెట్ సృష్టించి, ఆమె పేరు మీద ఉన్న ఇంటిని ఇతరుల పేరు మీద రిజిస్ట్రేషన్ చేయించిన దారుణం బయటపడింది. ఎలాంటి విచారణ లేకుండా, మీసేవ నుంచి సర్టిఫికెట్ జారీ అయిపోవడం, దాని ఆధారంగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఇంటి రిజిస్ట్రేషన్ జరిగిపోవడం అధికారుల నిర్లక్ష్యానికి పరాకాష్టగా చెప్పుకుంటున్నారు.

అధికారుల నిర్లక్ష్యమే కారణమా..?

ఒకదాని వెంట ఒకటిగా ఫేక్ సర్టిఫికెట్ల ఘటనలు బయటపడుతున్నా జిల్లా యంత్రాంగం నుంచి సరైన స్పందన లేకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. మీసేవ, పంచాయతీరాజ్, రెవెన్యూ, వైద్య శాఖల మధ్య సమన్వయం లేకపోవడం, ఆన్‌లైన్‌లో జారీచేసే సర్టిఫికెట్లను క్రాస్‌చెక్ చేయకపోవడం వల్లే ఈ దందా యథేచ్ఛగా సాగుతోందని ప్రజలు ఆరోపిస్తున్నారు.

ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకుని, గతంలో జారీ చేసిన అనుమానాస్పద సర్టిఫికెట్లపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ప్రజా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

నెలరోజుల క్రితం..

నెల రోజుల క్రితమే కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రి వైద్యుడి సంతకాన్ని ఫోర్జరీ చేసి ఫేక్ మెడికల్ సర్టిఫికెట్లు సృష్టించిన ఘటన జిల్లాలో కలకలం రేపింది. కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకం కింద అదనపు లబ్ధి పొందడం కోసం వయసు తక్కువగా చూపిస్తూ, ప్రభుత్వ వైద్యుడి సంతకంతో నకిలీ వయసు ధృవీకరణ పత్రాలు తయారు చేసినట్లు తేలింది. ఈ వ్యవహారంలో మధ్యవర్తులు, కొందరు ప్రైవేట్ టైపింగ్ సెంటర్ల పాత్ర ఉందని ఆరోపణలు వచ్చాయి. ఈ కేసులో ముగ్గురిని సైతం పోలీసులు అరెస్ట్ చేసినప్పటికి గాలికే వదిలేశారనే విమర్శలు ఉన్నాయి.



పురం అభివృద్ధికి కలిసికట్టుగా కృషి చేద్దాం

అక్షరటుడే, భీమ్‌గల్: భీమ్‌గల్ పట్టణాభివృద్ధికి కౌన్సిల్ సభ్యులంతా కలిసికట్టుగా కృషి చేయాలని పురపాలక సంఘ ఛైర్‌పర్సన్ బోదిరే నాగమణి స్వామి పిలుపునిచ్చారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఆమె అధ్యక్షతన బుధవారం మున్సిపల్ సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ గజానంద్ మాట్లాడుతూ.. సమావేశంలో గౌరవ కౌన్సిలర్లు లేవనెత్తిన పలు అభివృద్ధి అంశాలను ఏకగ్రీవంగా తీర్మానించినట్లు వెల్లడించారు. పట్టణ సంక్షేమానికి, మున్సిపాలిటీ ప్రగతికి అందరి సహకారంతో ముందుకెళ్తామని ఛైర్‌పర్సన్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఛైర్‌పర్సన్ సంటి లత నర్సయ్య, కౌన్సిలర్లు ఆరేపల్లి శ్రీజ, పర్స కుశలత, తోట సతీష్, గున్నాల బాలలక్ష్మి, బోదిరే లావణ్య, మహమ్మద్ అంజుమ్ అలీ, మమిరి సందీప్, నీలం రవి, సంగ్యా నాయక్ మాలావత్, మల్లెల అనుపమలతో పాటు వివిధ శాఖల మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఎస్ఐఆర్ ఓటర్ల విచారణపై అఖిలపక్ష సమావేశం

అక్షరటుడే, ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి నియోజకవర్గంలో ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా వివిధ కేటగిరీల్లో గుర్తించిన ఓటర్ల విచారణపై అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. బుధవారం ఎల్లారెడ్డి ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో అధ్యక్షతన ఉదయం 10 గంటలకు జరిగిన సమావేశంలో తహసీల్దార్, ఎన్నికల సిబ్బంది, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్ఐఆర్‌కు సంబంధించి ఇప్పటివరకు జరిగిన పురోగతిని అధికారులు అఖిలపక్ష ప్రతినిధులకు వివరించారు. నియోజకవర్గంలో మొత్తం 283 పోలింగ్ కేంద్రాలు ఉండగా, 56,469 నోటీసులు జారీ చేశారు. వీటిలో 56,437 నోటీసులు పంపిణీ కాగా, 50,578 మంది ఓటర్లపై విచారణ (హియరింగ్) పూర్తయిందన్నారు. మరో 560 హియరింగ్‌లు పెండింగ్‌లో ఉన్నట్లు అధికారులు తెలిపారు. హియరింగ్ అనంతరం 49,433 మంది ఓటర్లను ఫైనల్ పబ్లికేషన్ కోసం పార్క్ చేయగా, హియరింగ్ అవసరం లేని కేటగిరీలో మరో 944 మంది ఉన్నట్లు వెల్లడించారు. ఇప్పటివరకు మొత్తం ప్రక్రియ 87.49 శాతం పూర్తయినట్లు అధికారులు తెలిపారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ



అక్షరటుడే, బాల్కొండ: మండలంలోని కిసాన్ నగర్‌లో సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరైన రెండు చెక్కులను బుధవారం బీఆర్ఎస్ నాయకులు అందజేశారు. లబ్ధిదారులు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి చొరవతో సీఎంఆర్ఎఫ్ చెక్కులు మంజూరు కావడంతో కృతజ్ఞతలు తెలిపారు. సీఎంఆర్ఎఫ్ సాయం పేదలకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బద్దం ప్రవీణ్ రెడ్డి, సర్పంచ్ రామరాజు గౌడ్, ఉప సర్పంచ్ స్వామి తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికల కమిషనర్ దిష్టిబొమ్మ దహనం

అక్షరటుడే, బాల్కొండ: మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సట్ల ప్రవీణ్ ఆధ్వర్యంలో ఎస్ఐఆర్ పై నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా ఓటర్లను జాబితా నుంచి తొలగించడం రాజ్యాంగ విరుద్ధమని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. ప్రజల ప్రజాస్వామ్య, ఓటు హక్కులను పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని వారు పేర్కొన్నారు. ఓటర్ల జాబితాలో జరుగుతున్న మార్పులపై నిరసన వ్యక్తం చేస్తూ ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ దిష్టిబొమ్మను దహనం చేశారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చెన్నై షాపింగ్ మాల్ ప్రారంభం..



అక్షరటుడే, ఆర్మూర్: ఆర్మూర్ పట్టణంలో చెన్నై షాపింగ్ మాల్‌ను ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి సినీనటి, యాంకర్ శ్రీముఖి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి, ఆర్మూర్ మున్సిపల్ ఛైర్‌పర్సన్ గోనె లహరి రఘు, కాంగ్రెస్ పార్టీ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి వినయ్ కుమార్ రెడ్డి, వివిధ పార్టీల నాయకులు, షాపింగ్ మాల్ నిర్వాహకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆటో,కారు ఢీ.. ఇద్దరికి గాయాలు

అక్షరటుడే, కామారెడ్డి : ఎదురెదురుగా వస్తున్న కారు, ఆటో ఢీకొన్న ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన కామారెడ్డి పట్టణంలోని రామారెడ్డి బైపాస్ బ్రిడ్జి వద్ద బుధవారం చోటుచేసుకుంది. కామారెడ్డి నుంచి రెడ్డిపేటకు ఆటో వెళ్తోంది. అదే సమయంలో రామారెడ్డి వైపు నుంచి కామారెడ్డికి ఓ కారు వస్తోంది. రామారెడ్డి రోడ్డులో గల బైపాస్ బ్రిడ్జి నూతనంగా నిర్మాణం అవుతున్న మసీదు వద్దకు రాగానే ఆటో, కారు ఒక్కసారిగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో రెడ్డిపేట గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ గొల్ల శంకర్, కారులో ప్రయాణిస్తున్న ముస్తాబాద్ మండలం ఆవునూర్ కొండాపూర్ గ్రామానికి చెందిన చిగురు నర్సవ్వకు గాయాలయ్యాయి. ఆటోలో ప్రయాణిస్తున్న మరొక ప్రయాణికునికి కూడా గాయాలయ్యాయి. వెంటనే గాయపడిన వారిని చికిత్స నిమిత్తం కామారెడ్డి జీజీహెచ్ కు తరలించారు. ప్రస్తుతం చికిత్స కొనసాగుతోంది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆటో బోల్తా.. పలువురికి స్వల్ప గాయాలు

అక్షరటుడే, కామారెడ్డి : ఆటో బోల్తాపడి పలువురికి గాయాలైన ఘటన కామారెడ్డి పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం సమీపంలో బుధవారం చోటుచేసుకుంది. రాజంపేట మండల కేంద్రానికి చెందిన కొంతమంది ఆటోలో కామారెడ్డికి వచ్చారు. ఆటో నిజాంసాగర్ చౌరస్తా నుంచి కొత్తబస్టాండ్ వెళ్తుండగా మున్సిపల్ కార్యాలయం సమీపంలో ఆటోకు ఓ మహిళ అడ్డుగా రావడంతో ఆటో ఒక్కసారిగా డివైడర్ వైపు పడిపోయింది. ఈ ఘటనలో ఆటోలో ఉన్న ఏడుగురికి స్వల్ప గాయాలయ్యాయి. ఆటో వేగంగా లేకపోవడంతో పెనుప్రమాదం తప్పిందని స్థానికులు పేర్కొన్నారు. స్వల్ప గాయాలతో బయటపడటంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. గాయాలైన వారిని వెంటనే జీజీహెచ్‌కు తరలించి ప్రాథమిక చికిత్స నిర్వహించి ఇంటికి పంపించేశారు.

ఫామ్ హౌస్‌లో ఏఈవో బలవన్మరణం



అక్షరటుడే, కామారెడ్డి: వ్యవసాయ శాఖలో ఏఈవోగా పనిచేస్తున్న ఉద్యోగి ఆత్మహత్య చేసుకోవడం జిల్లాలో విషాదం నింపింది. ఈ ఘటన రాజంపేట మండలం తలమడ్ల గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. తలమడ్ల గ్రామానికి చెందిన సావుసాని శ్యామ్ సుందర్ రెడ్డి(47) రాజంపేట ఏఈవోగా విధులు నిర్వర్తిస్తున్నాడు. రోజూలాగే ఉదయం ఫామ్ హౌస్ వద్దకు వెళ్లిన ఆయన, విధులకు వెళ్లే సమయం దాటినా ఇంటికి తిరిగి రాలేదు. ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ రావడంతో అనుమానం వచ్చిన కుటుంబ సభ్యులు ఫామ్ హౌస్ వద్దకు వెళ్లి చూశారు. అక్కడ ఓ గదిలో శ్యామ్ సుందర్ రెడ్డి ఉరేసుకుని ఉన్నట్లు గుర్తించారు. రెగ్యులర్‌గా విధులకు వెళ్లే శ్యాంసుందర్ రెడ్డి అకస్మాత్తుగా ఆత్మహత్యకు పాల్పడటం ఇటు వ్యవసాయ శాఖలో, అటు గ్రామంలో తీవ్ర విషాదాన్ని నింపింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని, పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి జీజీహెచ్‌కు తరలించారు. ఆత్మహత్యకు ఉన్న కారణాలు ఇంకా తెలియరాలేదు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులకు క్రీడాదుస్తుల అందజేత

అక్షరటుడే, మెండోరా: మండలంలోని బుస్సాపూర్ ప్రాథమిక పాఠశాలలో బుధవారం గాంధారి మండలం పేట్ సంఘం వెల్ఫేర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు రూ.20వేల విలువైన



క్రీడాదుస్తులను అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ సభ్యులు బాలరాజు, బాలార్జున్ గౌడ్ మాట్లాడుతూ పేట్ సంగం గ్రామంలో పూర్వ ఉపాధ్యాయులు విద్యార్థుల సహాయ సహకారాలతో ఏర్పడిన పేట్‌సంఘం ట్రస్ట్ ద్వారా ఈ సహాయ సహకారాలు అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ట్రస్ట్ సభ్యులను పాఠశాల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రమేష్, ఉపాధ్యాయులు కవిత అరుంధతి, ట్రస్ట్ సభ్యులు భూమేశ్వర్ సంగ్రామ్, ప్రవీణ్, అఖిల్ గౌడ్ భాస్కర్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.